గ్రామాల్లో క్షీణించిన పారిశుద్ధ్యం

- మురికి కూపాలుగా అంతర్గత రోడ్లు
- చెత్తాచెదారంతో దర్శనమిస్తున్న వీధులు
- విజృంభిస్తున్న దోమలు


లింగవరం రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలోని పలు గ్రామాలు మురికి కూపాలుగా మారాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు చెత్త, చెదారం, మురుగునీటితో అధ్వానంగా మారాయి. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు విజృంభిస్తున్నాయి. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉండటంతో గ్రామాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గుడివాడ నియోజకవర్గంలో నందివాడ, గుడివాడరూరల్, గుడ్లవల్లేరు మండలాల్లో దాదాపుగా 66 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వేసవిలో వర్షాలు పడటంతో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ అధికారులు దృష్టిసారించడం లేదు. వర్షాల వల్ల డ్రెయినేజీ మురుగు నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. గ్రామాల్లో కనీసం డ్రెయినేజీ పూడికతీత పనులు కూడా చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు తీయకపోవడం వల్ల పూడిపోయి మురుగునీరు పారుదల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అలసత్వం

గ్రామాల్లో సైడ్ డ్రెయిన్‌ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించి రోజుల తరబడి నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. మురుగు నీటిని బయటకు పంపే పనులను పంచాయతీ అధికారులు విస్మరించడంతో మురుగు నీరు నిల్వలు దోమలకు ఆవాసాలుగా మారాయి. దోమల వల్ల ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దోమలు కుట్టడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వంతో సైడ్ డ్రెయిన్‌లలో పూడికతీత పనులు చేయకపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే...


నందివాడ మండలం వెంకటరామాపురం వద్ద చెత్తాచెదారం

గ్రామాల్లో అంతర్గత రోడ్లు, వీధులు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణకు ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేశారు. పట్టణాల మాదిరిగానే గ్రామాల్లోనూ చెత్తను సేకరించేందుకు వాహనాలు, ప్రత్యేక సిబ్బందిని పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడంతో గ్రామాల్లోని వీధులు పరిశుభ్రంగా ఉండేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చెత్త సేకరణ పనులు పట్టించుకోకపోవడంతో వీధులన్నీ మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కచ్చితమైన కొలతలతో రేషన్ పంపిణీ చేయాలి

ఉయ్యూరు ఆర్డీవో హెలెన్ షారోన్


పామర్రులో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీవో హెలెన్ షారోన్

పామర్రు: లబ్ధిదారులకు కచ్చితమైన కొలతలలో రేషన్‌ను పంపిణీ చేయాలని ఉయ్యూరు ఆర్డీవో బీ హెలెన్ షారోన్ సూచించారు. గ్రామంలో ఎండీయూ ద్వారా చేస్తున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. వాహనం వద్ద ఉన్న వినియోగదారులను పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌లో ఇచ్చే బియ్యం, పంచదార తదితర సరుకులను సకాలంలో వినియోగదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా సమయపాలన పాటించాలని చెప్పారు. ఇంటింటికీ తిరిగి రేషన్ సరుకులను లబ్ధిదారులకు నూటికి నూరుశాతం పంపిణీ చేయాలని అన్నారు. అనంతరం స్థానిక రేషన్ షాపును తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ రవికాంత్, ఆర్ఐ ఏ రాము, పీడీఎస్ డీటీ రంగారావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర వికాసంపై వేసవి శిక్షణ


పామర్రులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సత్యశ్రీ

పామర్రు: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను కిశోర బాలికలకు వివరించామని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యశ్రీ పేర్కొన్నారు. స్థానిక సచివాలయం-1 కోబ్బరితోట ఏరియాలో కిశోర వికాసంలో భాగంగా వేసవి శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే అధికారులకు తెలియజేయాలని కోరారు. ఏఎన్‌ఎం విజయలక్ష్మి, మహిళా పోలీస్ స్వాతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే చాట్లవానిపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమావేశం నిర్వహించారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సాలి శ్రీదేవి, ఎన్ నాంచారమ్మ, కే సుజాత, జే ప్రేమలత పాల్గొన్నారు.

కూచిపూడి అంగన్‌వాడీలో..

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి సెక్టార్ పరిధిలోని కూచిపూడి-1 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసంపై వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీసీపీయూ(ఉమెన్ డెవలప్మెంట్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్) మహిళా శిశు సంక్షేమ శాఖ లీగల్ కం ప్రొబిషన్ ఆఫీసర్ వీ శైలజ పాల్గొని కిశోర బాలికలకు పలు సూచనలు ఇచ్చారు. బాల్యవివాహాల నిషేధ చట్టం, బాలల హక్కులు రక్షణ - పోక్సో చట్టాలపై వివరించారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఏఎస్ కల్యాణి, మహిళా పోలీస్ జీ భార్గవి, ఏఎన్‌ఎం వసుంధర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానేత విగ్రహానికి ముసుగు తీయరా..?


ముసుగు తీయని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం

గుడివాడ టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగు నేటికీ తొలగించకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ. 12 కోట్లు ఖర్చుచేసి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 100 పడకలతో అత్యాధునిక వసతులు కల్పించింది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఫిబ్రవరి 3వ తేదీన ముసుగు వేశారు. ఫిబ్రవరి 27వ తేదీ ఎన్నికలు నిర్వహించి మార్చి 3వ తేదీ ఫలితాలు కూడా ప్రకటించారు. ఫలితాలు వెలువడిన మరుసటి రోజే రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగు తొలగించాల్సి ఉంది. అయితే స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వేసిన ముసుగు నేటికీ తొలగించకపోవడాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు. రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై కూటమి నాయకుల కక్షసాధింపు ధోరణి ఇందుకు నిదర్శనమని రోగులు సైతం ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మాక్ డ్రిల్


కైకలూరు సీహెచ్‌సీలో మాక్ డిల్ర్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కైకలూరు: కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) కైకలూరులో వార్ మాక్ డ్రిల్‌ను శుక్రవారం నిర్వహించారు. సూపరింటెండెంట్ అల్లాడ శ్రీనివాసరావు ఆదేశాలతో ఇండియా - పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో ఏ విధంగా తక్షణ ప్రాథమిక చికిత్స చేయాలనే అంశంపై మాక్ డ్రిల్ జరిగింది. ఆయా బెడ్‌లపై క్షతగాత్రులు ఉన్నట్లుగా భావించి ఆక్సిజన్ సిలెండర్లు, గాయాలకు చికిత్స వంటివి చేశారు. బాంబు దాడులు జరిగినప్పుడు నేలపై ప్రజలు బోర్లా పడుకోవాలని సూచించారు. మాక్ డ్రిల్‌లో డాక్టర్లు రమాదేవి, కరిష్మా బేగం, బాల ప్రసూనదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణం నరకప్రాయం


ఇలపర్రులో గోతులు పడి అధ్వానంగా మారిన ప్రధాన రహదారి


వెన్ననపూడిలో జలమయమైన రోడ్డు

నందివాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్లను అభివృద్ధి చేస్తామని నాయకులు ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మిగిలాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా రోడ్ల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. ఏ రోడ్డు చూసినా గుంతలతో రాళ్లు తేలి దర్శనమిస్తున్నాయి. ఎన్నికల సమయంలో హామీల పేరిట నానా హంగామా చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

తూతూమంత్రంగా మరమ్మతులు

ఇలపర్రు నుంచి వెన్ననపూడి వెళ్లే రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. ముందు నుయ్యి వెనక గొయ్యి అన్నట్టు ఉంది ఈ రోడ్ల పరిస్థితి. ఎర్ర బుగ్గ వేసి వదిలేయడంతో ద్విచక్ర వాహనదారులు నరకం చూస్తున్నారు. ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుకు కొన్నిచోట్ల తాత్కాలిక మరమ్మతులు తూతూమంత్రంగా చేయడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వెన్ననపూడి గ్రామానికి వెళ్లే రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కనీసం మరమ్మతులైన చేపట్టాలని కోరినా.. పట్టించుకునే నాథుడే లేడంటూ ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుకు గిట్టుబాటు ధర, కౌలు రైతులకు సమగ్ర చట్టాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌలురైతు చట్టంలో మార్పులు తేవాలని, ఉపాధి హామీ నిధులు పెంచి ఏడాదికి రెండు వందల రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ. 600 కూలి పెంచాలని, రైతుకు పంటనీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ కౌలురైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి పీ రంగారావు, సంఘం నాయకుడు ఎస్ రాజేంద్రప్రసాద్, రైతు సంఘం నాయకులు ఎం. సత్యన్నారాయణ, ఎస్ ఉమామహేశ్వరరావు, ఆర్‌సీపీ రెడ్డి, ఆర్ కొండ, పీ రజిని, జ్యోతి, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగన్నాథుని కల్యాణోత్సవాలు


స్వామి, అమ్మవార్ల దారు(చెక్క) విగ్రహాలు


జగన్నాథస్వామి ఆలయం

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధిచెందిన మండలంలోని వడాలి శ్రీ జగన్నాథస్వామి ఆలయ కల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15వ తేది వరకు జరిగే ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 10న విశేష పూజలు చేసి స్వామి వారిని పెళ్లి కుమారుడిగా అలంకరిస్తారు. ఈ సందర్భంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, దీక్షా ధారణ, రక్షాబంధన కార్యక్రమాలు జరుగుతాయి. 11న రాత్రి శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణం, 13న స్వామివారికి చతుర్దశ కలశ స్నపన, చక్రస్నానం నిర్వహిస్తారు. 14న పవళింపు సేవ, 15న అఖండ అన్నసమారాధన జరుగుతుంది.

సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య భగవద్గీత పారాయణం, సాయంత్రం అన్నమయ్య పదామృతం నిర్వహిస్తారు. 10వ తేది రాత్రి ఇంద్రజాల ప్రదర్శన, 11న సినీ మురళీ కోలాట ప్రదర్శన, 12న సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం, 13న పూలరంగడు సాంఘిక నాటకం, 14న అయ్యప్ప గానామృతం, 15న కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు జరుగుతాయని వివరించారు.

సత్రం ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల

పామర్రు: స్థానిక బొమ్మారెడ్డి పెదబుల్లియ్య అనే వెంకటరెడ్డి సత్రానికి ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల అయిందని సత్రం మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 20 రోజుల లోపు తమ దరఖాస్తులను మచిలీపట్నంలోని సహాయ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

షార్టు సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

పామర్రు: విద్యుత్ ఇన్నర్ వైరింగ్ షార్టు సర్క్యూట్‌తో శుక్రవారం అరండాల్‌పేటలో అగ్ని ప్రమాదం జరిగింది. వివరాల ప్రకారం.. అరండాల్ పేటలోని తోట అనురాధకు చెందిన ఇంట్లో ఎవరూ లేని కారణంగా ఇన్నర్ వైరింగ్ షార్టు సర్క్యూట్ అవడంతో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని ఏసీ, మంచం, కబోర్డు, పరుపు, రెండు ల్యాప్‌ట్యాప్స్ అగ్నికి ఆహుతైనాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి ఎస్ రాంబాబు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2లక్షల విలువైన వస్తువులు దగ్ధం అయ్యాయని తెలిపారు.

మృతుల కుటుంబాలకు నాయకుల పరామర్శ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం విన్నకోటకు చెందిన ముత్యాల అరుణ్, కూరెళ్ల అభిషేక్ ట్రాక్టర్ తిరగబడి మృతిచెందారు. మృతుల కుటుంబాలను శుక్రవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ కొడాలి రామరాజు, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, పాలేటి నాగాంజనేయులు, అడుసుమిల్లి చిట్టిబాబు పాల్గొన్నారు. అలాగే ఎన్టీఆర్ స్టేడియం మాజీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శాయన రవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, పాల సంఘ అధ్యక్షుడు శాయన హరిబాబు, బైండ్ల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు నిడుమోలు పెద్దిరాజు, సర్పంచి సాంబయ్య తదితరులు మృతదేహాలకు పూలమాలలు వేసి, మృతుల కుటుంబాలను పరామర్శించారు.

వాహనాల తనిఖీ

మండవల్లి: మండవల్లి జాతీయ రహదారిపై సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ రామచంద్రరావు, సిబ్బందితో కలిసి ప్రైవేటు బస్సులు, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం సేవించిన, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు.

మండవల్లిలో భారీ వర్షం


గుడ్లవల్లేరులో ఈదురు గాలులతో వర్షం

మండవల్లి: మండవల్లిలో శుక్రవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది. ఎండల వేళ కురిసిన వర్షం ప్రజలకు కాస్త ఊరట కలిగించింది. వర్షం నేపథ్యంలో వ్యవసాయ శాఖాధికారి ఎస్‌కే జరీనా రైతులకు పలు సూచనలు చేశారు. వర్షం పడిన నేపథ్యంలో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లి పెసర వంటి విత్తనాలను రైతులు వేసుకోవచ్చని సూచించారు. నవధాన్యాలు కూడా చల్లుకోవచ్చని తెలిపారు. ఈ సమయంలో వాటిని చల్లుకుంటే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో ఈదురు గాలులతో కుండపోతగా శుక్రవారం వర్షం కురిసింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో పిడుగులు పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించినట్లు ట్రాన్స్‌కో ఏఈ వరకుమార్ తెలిపారు. వర్షంతో పలు రోడ్లు జలమయమయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కైకలూరు పరిసర ప్రాంత విద్యుత్ వినియోగదారులు, ఆక్వా యజమానులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు కల్యాణ మహోత్సవం

పామర్రు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 11వ తేదీ రాత్రి 8.42 నిమిషాలకు కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అలాగే మండల పరిధిలోని పెదమద్దాలి గ్రామంలోని శ్రీ ఉద్దండ వేణుగోపాలస్వామి ఆలయంలో త్రయాహ్నిక దీక్షతో కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు వార్షిక కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు.

12న సామూహిక ధ్యానం

గుడివాడ టౌన్: బుద్ధ పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఈనెల 12వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సామూహిక ధ్యానం, ఆత్మ జ్ఞాన సందేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన డీఎస్‌పీ స్వర్ణలత, మంచిర్యాలకు చెందిన పీ శ్రీధర్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. ధ్యాన ప్రియులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆమె కోరారు.

సర్పంచ్‌ను దూషించిన ఘటనపై కేసు నమోదు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు సర్పంచ్ పెనుమత్స రాధిక ఇంటి ఆవరణలోకి ప్రవేశించి దుర్భాషలాడటంతోపాటు దాడికి యత్నించిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ అవినాశ్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన సున్నం ప్రశాంత్, మాతంగి అనిల్‌కుమార్, పిల్లి సిద్ధు, సున్నం తంబి, సున్నం రాజేష్‌లు సర్పంచ్ రాధిక ఇంటి ఆవరణలోకి గురువారం సాయంత్రం ప్రవేశించి అకారణంగా రాధికను, ఆమె భర్త పీఎస్ కోటేశ్వరరావును దూషించారు. ఈ ఘటనపై సర్పంచ్ రాధిక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పోప్ ఎంపికపై హర్షం

గుడివాడ టౌన్: రోమన్ క్యాథలిక్ ప్రపంచ పోప్(మత గురువు)గా రాబర్ట్ ఫ్రాన్సిస్ ప్రివోస్ట్ ఎంపికపై వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ ఏలేటి విలియం జోషి హర్షం వ్యక్తం చేశారు. 267వ పోప్‌గా ఎంపికైన రాబర్ట్ ఫ్రాన్సిస్ ప్రివోస్ట్ ప్రార్థనలతో ప్రపంచ శాంతి కలగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నందివాడ: నూతులపాడు గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నారని డ్రోన్ కెమెరా పరిశీలనలో గుర్తించి నందివాడ ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోని తీసుకొని, వారి వద్ద నుంచి రూ. 2,700 నగదు స్వాధీనం చేసుకొని వారిపై నందివాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేటి నుంచి వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు

తోట్లవల్లూరు: బొడ్డపాడులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక శాంతి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 10 నుంచి 12వ తేది వరకు జరుగుతాయని ఆలయ ఈఓ సుపద్మాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం ఆరు గంటలకు అంకురారోపణ, ధ్వజారోహణం, 11వ తేది సాయంత్రం స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం, 12న ఉదయం గ్రామోత్సవం, స్వామివారి పవళింపు సేవ జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

అమ్మవారికి ముక్కుపుడక బహూకరణ



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ గంగా బాలాత్రిపురసుందరి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలోని బాలాత్రిపురసుందరికి శుక్రవారం బెంగుళూరులో స్థిరపడిన కూచిపూడి వాస్తవ్యులు ఆకుల శ్రీనివాసరావు, శివస్వప్న దంపతులు రూ. 21,500 విలువైన బంగారు ముక్కుపుడకను బహూకరించారు. దేవాలయ పాలకమండలి సభ్యులు భాగవతుల బాలకృష్ణ ప్రసాద్(కార్యదర్శి), పసుమర్తి నారాయణ మూర్తి(ఉపాధ్యక్షుడు) చేతుల మీదుగా అర్చకుడు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మకు అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోతులూరి వీరబ్రహ్మంకు ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: అంగలూరు గూడెంలో మామిడి బాబూరావు ఆధ్వర్యాన శ్రీపోతులూరి వీరబ్రహ్మం జయంతి వేడుకల ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఇందిరాగాంధీ బొమ్మ పక్కన ఉన్న నేరేడు చెట్టు కింద వెలిసిన బ్రహ్మంగారి పీఠం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 500మందికి అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో బాబూరావు, నాగమల్లీశ్వరి, కమిటీ సభ్యులు మామిడి ఏడుకొండలు, చిలుముల కృష్ణ, చిలుముల సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తోట్లవల్లూరు: యాకమూరు గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వీ భానుశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు 21 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన వివాహిత మహిళ అర్హులని తెలిపారు. దరఖాస్తుకు తాజాగా తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డు నకలు జతపరచాలని పేర్కొన్నారు. ఈ నెల 17వ తేది సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులను పామర్రు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



గుడివాడరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలిని తన వాహనంలో ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్యం అందేలా చేసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని బొమ్ములూరు వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి వాహనంపై ఉన్న నందివాడ మండలం పెదలింగాల గ్రామానికి చెందిన అచ్చమ్మ అనే వృద్ధురాలు కిందపడి తీవ్ర గాయాల పాలైంది. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే రాము ప్రమాదాన్ని చూసి గాయపడిన వృద్ధురాలిని తన కారులో ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రైవేట్ ఆసుపత్రి సిబ్బందిని ఎమ్మెల్యే ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం గుడివాడ వచ్చిన ఎమ్మెల్యే వృద్ధురాలిని ఆసుపత్రిలో పరామర్శించారు. ఎమ్మెల్యేకు అచ్చమ్మ కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ సర్వీస్ రోడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన లారీ డ్రైవర్ మేరుగు కృష్ణ(44) లారీలో ఈనెల 7న గుడివాడ నుంచి గుంటూరు బయలుదేరాడు. తాడేపల్లి సర్వీస్ రోడ్‌లో భోజనం చేసేందుకు లారీ నిలిపి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో కృష్ణను అతి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతన్ని తాడేపల్లి పోలీసులు వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఆయన మృతి చెందాడు. కృష్ణ కుమారుడు ఫణి ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ ప్రతాప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.